## క్లుప్తంగా

### వాహనాల తనిఖీ

మణుగూరురూరల్: మండలంలోని హనుమాన్ టెంపుల్ అర్బన్ పార్క్ సమీపంలో సీఐ నాగబాబు, ఎస్సై రంజిత్‌లు సిబ్బందితో కలిసి ఆదివారం వాహన తనిఖీలు నిర్వహించారు. ప్రధాన రహదారి గుండా రాకపోకలు సాగించే ప్రతీ వాహనాన్ని నిలిపి క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మావోయిస్ట్ వారోత్సవాల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా వాహనాలను తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. అనుమానిత వ్యక్తులు తారసపడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

### ఇందిరానగర్‌లో సీసీ రోడ్డు నిర్మించాలి



రోడ్డుపై బైఠాయించిన సీపీఎం నాయకులు, స్థానికులు

చండ్రుగొండ: మండలకేంద్రం శివారులోని ఇందిరా నగర్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మించాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో కాలనీవాసులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో రోడ్డు సమస్య వెంటాడుతోందని, వర్షాకాలంలో గుంతలు, బురదతో రాకపోకలు కష్టమవుతున్నాయని అన్నారు. విద్యార్థులు, వృద్ధులు, గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అలాగే వీధిలైట్లు లేక చీకట్లో ప్రమాదాలు జరుగుతున్నాయని, తాగునీటి సమస్య కూడా తీవ్రంగా ఉందని పేర్కొన్నారు. వెంటనే చర్యలు తీసుకుని సీసీ రోడ్డుతో పాటు వీధిలైట్లు, తాగునీటి సమస్య పరిష్కరించాలని అధికారులను కోరారు. నిరసనలో సీపీఎం నాయకులు విప్పర్ల వెంకటేశ్వర్లు, రాయి రాజా, అబ్దుల్ రెహమాన్, మిరియాల మోహన్ రావు, ఎస్‌కె.నాగుల్ మీరా తదితరులు పాల్గొన్నారు.

### పోలీసులకు సమాచారం ఇవ్వండి

దమ్మపేట: దసరా పండుగ సెలవుల సందర్భంగా బంధువుల ఇళ్లకు, దూరపు ప్రయాణాలు చేయదలచిన వారు ముందస్తుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని దమ్మపేట ఎస్సై సాయికిషోర్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో సూచించారు. పొరుగు ఊర్లకు వెళ్లేవారు, వారి ఇళ్లకు తాళాలు వేసి, ఇంటి అడ్రస్సు తదితర వివరాలను పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి ఇళ్లల్లో దొంగతనాలు జరుగకుండా, ఆ ప్రాంతాల్లో పోలీస్ పెట్రోలింగ్ పెంచుతామని తెలిపారు.

### డిప్యూటీ సీఎంను కలిసిన ఆత్మ కమిటీ చైర్మన్



డిప్యూటీ సీఎంతో వీరభద్రరావు, తదితరులు

అశ్వారావుపేటరూరల్: ఆత్మ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైనా అశ్వారావుపేటకు చెందిన నాయకులు సుంకవల్లి వీరభద్రరావు.. స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణతో కలిసి రాష్ట్ర డిప్యూటీ సీఎంతోపాటు పలువురు మంత్రులను కలిశారు. హైదరాబాద్‌లోని డిప్యూటీ సీఎం మల్లుభట్టి విక్కమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, అదే విధంగా కార్పొరేషన్ చైర్మన్లు మువ్వా విజయ్‌బాబు, పొదెం వీరయ్య తోపాటు మరికొంత మందిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందించారు. నూతనంగా చైర్మన్‌గా ఎంపికైన వీరభద్రరావును వారు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమాల్లో స్థానిక సొసైటీ చైర్మన్ చిన్నంశెట్టి సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు తుమ్మా రాంబాబు, మిండా హరిబాబు, కె.మోహన్ రావు పాల్గొన్నారు.

### పెదవాగు ప్రాజెక్టుపై ఏపీ సీఎంకు వినతి

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గుమ్మడవల్లి వద్ద ఉన్న పెదవాగు ప్రాజెక్టు పునరుద్ధరణకు నిధులు కేటాయించాలని ఏపీ సీఎం చంద్రబాబును స్థానిక మాజీ మంత్రి జలగం ప్రసాద్‌రావు వినతి చేశారు. ఈ మేరకు శనివారం రాత్రి ఏపీ సీఎంను అమరావతిలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. ఆ తర్వాత గతేడాది కురిసిన భారీ వర్షాలు, వరద కారణంగా గండ్లు పడిన పెదవాగు ప్రాజెక్టు పునఃనిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

# ‘ఎంగిలిపూల’తో బతుకమ్మ ప్రారంభం

తొమ్మిది రోజులపాటు కొనసాగే బతుకమ్మ సంబురాలు ఆదివారం ఎంగిలిపూల బతుకమ్మతో ఘనంగా ప్రారంభమయ్యాయి. వాడవాడల్లో ఆటపాటలు ఆరంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా ఆలయాలు, గద్దెల వద్దకు మహిళలు, యువతులు తొలి రోజు బతుకమ్మలను రంగురంగుల పూలతో పేర్చి తీసుకొచ్చారు. జానపద గీతాలు, నృత్యాలతో బతుకమ్మల చుట్టూ తిరుగుతూ.. సందడి చేశారు. పిల్లలు, పెద్దలు పాల్గొని వీక్షించారు. దీంతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

– సాక్షి నెట్‌వర్క్



అశ్వాపురం: రామచంద్రాపురంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



అశ్వారావుపేటరూరల్: బతుకమ్మలను తీసుకొచ్చిన మహిళలు



దుమ్ముగూడెం: కే లక్ష్మీపురం గ్రామంలో బతుకమ్మ సంబరాలు..



కరకగూడెం: బతుకమ్మలతో తల్లీకుమార్తె



అశ్వాపురం: బతుకమ్మలను తీసుకొస్తున్న చిన్నారులు



మణుగూరుటౌన్: ఆదర్శనగర్ చౌరస్తాలో మహిళల బతుకమ్మ ఆట



చర్ల: ఎంగిలిపూల బతుకమ్మలతో గద్దెల వద్దకు చేరుకుంటున్న మహిళలు



ములకలపల్లి: బతుకమ్మలతో మహిళలు



కరకగూడెం: బతుకమ్మ ఆడుతున్న మహిళలు

# ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి

మణుగూరుటౌన్: లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం పట్టణంలో ఆదివాసీలు ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్, కొమరం భీం విగ్రహాలకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ఎస్టీ జాబితాలో 9 తెగలలో స్థానిక షెడ్యూల్ ప్రాంత ఏజెన్సీ ట్రైబులను మాత్రమే ఉంచాలని, అక్రమంగా జాబితాలో చేర్చబడ్డ లంబాడాలను తొలగించాలని అన్నారు. ఈ సందర్భంగా చలో భద్రాచలం పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పలు ఆదివాసీ, ఉద్యోగ సంఘాల నాయకులు పూనెం రమేశ్, సోడె రవి, సింగం రవిబాబు, కణితి లక్ష్మణరావు, పూనెం రామకృష్ణ, దాట్ల బొర్రయ్య, పొడెం శ్రీను, కుర్సం రాధ, ఏనిక విజయకుమారి, పోడెం విజయకుమారి, జోగ కుమారి, గొంది వెంకటేశ్వర్లు, కుంజా నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ.. ఆదివాసీ



అశ్వారావుపేటరూరల్: ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీలు

సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అశ్వారావుపేటలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్దగల కొమరం భీం విగ్రహానికి పూలమాల వేసి ఆ తర్వాత పట్టణంలోని రింగ్ రోడ్ సెంటర్ మీదుగా శ్రీశ్రీ ఫంక్షన్ హాల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ముందుగా జరిగిన సభలో ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ.. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించే దాకా ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయులు, ఆదివాసీలు పాల్గొన్నారు.

# స్థానికులకే అవకాశం కల్పించాలి

మణుగూరుటౌన్: సింగరేణికాలరీస్ మణుగూరు ఏరియాలో మల్లెపల్లి ఓసీలో నూతనంగా ఓబీ పనులు దక్కించుకున్న గౌరవ్ కంపెనీలో స్థానిక నిరుద్యోగ యువతకే ఉపాధి అవకాశాలు కల్పించాలని రేణుక అక్షర మహిళా మండలి సభ్యులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో మండలి అధ్యక్షురాలు పూనెం సరోజ మాట్లాడుతూ.. సింగరేణి ఓబీ కంపెనీలలో పక్క రాష్ట్రాల నుంచి వందలాది మందిని తీసుకుచ్చి పనులు చేయిస్తూ స్థానిక యువతకు ఉద్యోగాలు లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. 80 శాతానికి తగ్గకుండా ఉపాధి అవకాశాలను సీఎండీ బలరాం ఆదేశాల మేరకు స్థానికులకే కల్పించాలని.. లేదంటే జీఎం కార్యాలయాన్ని ముట్టడించడంతో పాటు ఐటీడీఏ పీఓకు ఫిర్యాదు చేస్తామన్నారు. సమావేశంలో నాయకులు షబానా, శ్యామల, రేణుక, సుజాత, వసంత, డాకూరి సౌజన్య, శైలజ తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రేణుక అక్షర మహిళా మండలి సభ్యులు

# ప్రవక్త బోధనలు ఆచరణీయం

బూర్గంపాడు: ప్రస్తుత కాలంలో మహమ్మద్ ప్రవక్త బోధనలు ఆచరణీయమని ఐద్వా కమిటీ జిల్లా అధ్యక్షురాలు నాగలక్ష్మి అన్నారు. జమాతే ఇస్లామీ హింద్ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆదివారం సారపాకలో సీరతున్నబి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో సినిమాలు, సెల్‌ఫోన్లు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. నేరాలు, అశ్లీలత రోజురోజుకు పెరిగిపోతున్నాయన్నారు. ఈ తరుణంలో ప్రవక్త బోధనలు పాటించాలన్నారు. మైనార్టీ స్కూల్ ప్రిన్సిపాల్ జ్యోతి, లీలావతి, సరోజని, నపూరా, షహనాష్ పాల్గొన్నారు.

# బతుకమ్మతో కార్మికుల నిరసన



దుమ్ముగూడెం: బతుకమ్మ ఆడుతూ నిరసన తెలుపుతున్న డైలీవేజ్ వర్కర్లు

దుమ్ముగూడెం: తెలంగాణ ఆశ్రమ పాఠశాలల డైలీ వేజ్ వర్కర్ల యూనియన్, జేఏసీ ఆధ్వర్యంలో డైలీ వేజ్ వర్కర్ల సమ్మె ఆదివారం 10వ రోజుకు చేరగా.. లక్ష్మీనగరం ఆశ్రమ పాఠశాల ఎదుట బతుకమ్మ ఆడి ప్రభుత్వానికి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి, జేఏసీ జిల్లా నాయకులు హీరాలాల్, సీఐటీయూ మండల నాయకులు కొమరం చంటి మాట్లాడుతూ.. డైలీ వెజ్ వర్కర్స్ పది రోజులు పాటు సమ్మె చేస్తున్నప్పటికీ నేటి వరకు కూడా ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటు అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్మిక సంఘం కార్యదర్శి మర్మం చంద్రయ్య, జేఏసీ మండల కమిటీ సభ్యులు సమ్మక్క, మల్లమ్మ, రాధ, పరమేష్, సత్యనారాయణ, వీరభద్రం, బుర్రయ్య, మంగయ్య తదితరులు పాల్గొన్నారు.

**సమస్యలు పరిష్కరించాలి**

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ ముందు నిరవధిక సమ్మె చేస్తున్న ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న డైలీవేజ్ వర్కర్లు తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ కోరారు. డైలీవేజ్ వర్కర్ల సమ్మె శిబిరాన్ని ఆయన ఆదివారం సందర్శించి సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో పూనెం కృష్ణ, మంగమ్మ, శాంతమ్మ, రాములమ్మ, కుమారి, రాధ, ఆదిలక్ష్మి, లక్ష్మి పాల్గొన్నారు.

### నేడు తహసీల్‌లో ప్రజావాణి

భద్రాచలంటౌన్: భద్రాచలం తహసీల్దార్ కార్యాలయంలో నేడు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ దనియాల వెంకటేశ్వర్లు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి ఒంటి గంట వరకు నిర్వహించే ప్రజావాణిలో ప్రజల సమస్యలపై దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఆయన తెలిపారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

### తిర్లాపురంలో విద్యుత్ అంతరాయం

మణుగూరుటౌన్: మండలంలోని తిర్లాపురంలో ఆదివారం రాత్రి వేళ విద్యుత్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అప్పటిదాకా వీధి కూడళ్ల వద్ద గ్రామస్తులు బతుకమ్మ సంబురాలు నిర్వహించగా.. గాలిదుమారంతో కూడిన వర్షానికి ఒక్కసారిగా ఊరంతా చీకటిమయమైంది. వేడుకలకు ఇచ్చిన కరెంట్ కనెక్షన్‌లో సాంకేతిక లోపం కారణంగా ఇలా జరిగిందా లేక మరేదైనా కారణమో తెలియరాలేదు గానీ.. ఊరంతా కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు.

### అమ్మవారి ఊరేగింపు

మణుగూరుటౌన్: దసరా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పట్టణంలో ఆయా కమిటీల ఆధ్వర్యంలో ఉత్సవ విగ్రహాలను తీసుకెళ్లే క్రమంగా అంగరంగ వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. ఆదివారం పట్టణం మీదుగా విగ్రహాలు డప్పు చప్పుడ్లతో మేళతాళాలతో అమ్మవారి విగ్రహాన్ని ఊరేగించారు.

### పెండింగ్ వేతనాలు చెల్లించాలి

అశ్వాపురం: గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని బీఆర్ఎస్ మండల యువజన అధ్యక్షుడు గద్దల రామకృష్ణ డిమాండ్ చేశారు. అశ్వాపురంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్మికులు చాలీచాలని జీతాలతో తమ కుటుంబాలను పోషించుకుంటున్నారని నెలల తరబడి వారికి వేతనాలు కుటుంబాలు గడవక అవస్థలు పడుతున్నారని తెలిపారు. దసరా పండుగకు అయినా వేతనాలు విడుదల చేస్తే కుటుంబాలతో పండుగను సంతోషంగా జరుపుకుంటారని అన్నారు.

### ఆరోపణలు హాస్యాస్పదం

ములకలపల్లి: బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ములకలపల్లి మండల కాంగ్రెస్‌లో గ్రూపు తగాదాలకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించడం హాస్యాస్పదంగా ఉందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోరంపూడి అప్పారావు ఆదివారం ఓ ప్రకటనలో అన్నారు. ఇటీవల జరిగిన మంత్రి కార్యక్రమంలో బీఆర్ఎస్ కండువాలతో తమ పార్టీవారెవ్వరూ పాల్గొనలేదని స్పష్టం చేశారు. ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన వాళ్లను ప్రోత్సహించిన సొంతపార్టీ నాయకులను ఎదుర్కొనే సత్తాలేక ఇతర పార్టీల వారిపై నిందలు మోపుతున్నారని విమర్శించారు.

# మట్టి రవాణా ఆగట్లే..

ములకలపల్లి: ‘సీతారామ’ప్రధాన కాలువ సమీపం నుంచి సాగుతున్న మట్టి దందాకు అడ్డేలేకుండా పోతోంది. గత కొన్ని నెలలుగా నిరంతరాయంగా సాగుతున్న అక్రమ రవాణాతో ఇప్పటికే భారీగా మట్టి బయటికి తరలిపోయింది. పెద్దగోతులు పెట్టి, మట్టింతా అమ్మేసుకుంటున్నారు. అటవీప్రాంతంలో, నిర్మానుష్య ప్రదేశాన్ని ఎంపిక చేసుకున్న అక్రమార్కులు రాత్రి వేళ జేసీబీలతో లారీల్లో లోడింగ్ చేసి, విక్రయాలకు పాల్పడుతున్నారు. గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న దందా, ఇటీవల లారీ పట్టుబడడంతో బయటికి పొక్కింది. ఈ క్రమంలోసంబంధిత శాఖ అధికారులు ఠాణాలో ఫిర్యాదు చేసినట్లు చెపుతున్నారు. కానీ అక్రమం మాత్రం ఆగట్లేదు. ఎప్పటిలాగానే మట్టిని బయటి ప్రాంతాలకు తరలిస్తున్నట్లు సమాచారం.



సీతారామ ప్రధాన కాలువ సమీపంలో తవ్విన మట్టి..

# చిరస్మరణీయుడు కొండా లక్ష్మణ్

మణుగూరురూరల్: తెలంగాణ ఉద్యమకారుడు, స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ చిరస్మరణీయుడని పద్మశాలి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, మండల అధ్యక్షుడు డాక్టర్ దుస్సా సమ్మయ్య అన్నారు. ఆదివారం సంఘం ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఎదుట ఉన్న కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి ఆయన పూలమాల వేసి ఘన నివాళ్లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు కోట శ్రీనివాస్, రుద్ర నాగరాజు, కుర్రి నర్సింహరావు, సిరిపురం కోటేశ్వరరావు, ఎర్రం రత్నాకర్, తాటి సత్యనారాయణ, గోదారి రాజేశ్వరరావు, కొరివి బసవయ్య, వెన్నం సత్యనారాయణ, పోలూరి కృష్ణయ్య, కూచన మల్లేష్, గంగిశెట్టి శ్రీనివాస్, జాగరపు కనకయ్య, ఆమంచి ప్రసాద్, దాసరి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సంఘ నాయకులు

### ‘సీతారామ’తో సాగునీరు అందించాలి

బూర్గంపాడు: సీతారామ ప్రాజెక్ట్‌తో బూర్గంపాడు మండలంలోని భూములకు సాగునీరు అందించాలని మండల రైతులు, నాయకులు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును కోరారు. ఆదివారం ఎమ్మెల్యే పాయంను కలిసి వినతిపత్రం అందించారు. ప్రస్తుత అవసరాలను దృష్టిలో ఉంచుకుని సీతారామ ప్రాజెక్ట్ కాలువల నుంచి పెదవాగుకు నీరు విడుదల చేస్తే రామాపురం, ముసలిమడుగు, నాగినేనిప్రోలు, సారపాక రైతులకు సాగునీరు అందుతుందన్నారు. రైతుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి రైతులకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నాయకులు మువ్వ వెంకటేశ్వరరావు, యడమకంటి రోశిరెడ్డి, కాటం వెంకటరామిరెడ్డి,మదమంచి మాధవరావు, గాదె వెంకటేశ్వరరెడ్డి, గల్లా సైదేశ్వరరావు, తంగేళ్ల ముత్తయ్య, కుందురు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

### మండపాలకు అమ్మవారి విగ్రహాలు

దమ్మపేట: మండల కేంద్రం దమ్మపేట ప్రధాన సెంటర్‌లో అమ్మవారి విగ్రహాలతో సందడి వాతావరణం నెలకొంది. అమ్మవారి విగ్రహాల తయారీదారులు సెంటర్‌లో పలుచోట్ల విగ్రహాలను ఉంచి, అమ్మకాలు మొదలు పెట్టారు. రోడ్డు పక్కనే ఉన్న అమ్మవారి విగ్రహాలు, రకరకాల రంగుల్లో అద్భుతమైన రూపాల్లో చూపరులకు దర్శనమిస్తున్నాయి. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు, విగ్రహాలను కొనుగోలు చేసి తమ గ్రామలకు తరలిస్తున్నారు.

### యూటీఎఫ్ ఆర్థిక సాయం



మృతుని కుటుంబానికి చెక్కు అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

అశ్వారావుపేటరూరల్: మృతి చెందిన ఓ ఉపాధ్యాయుడు కుటుంబానికి యూటీఎఫ్ ఆధ్వర్యంలో చెక్కును అందించారు. ఈ మేరకు అశ్వారావుపేట ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో గత నెల 20న ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు దారబోయిన ప్రసాద్ మృతి చెందగా.. యూటీఎఫ్ ద్వారా మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం కింద రూ.6లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు బి.రాజు, జిల్లా నాయకులు ఎం.వెంకటేశ్వర్లు, కె.హరినాథ్‌బాబు, ఎస్.కృష్ణ, దాసు, నల్లపు కొండల రావు, ఎస్.వెంకటేశ్వర్లు, ఆర్.రమేష్, మడివి కృష్ణారావు, రాజేశ్వరరావు, కె.మధు, జ్యోతి పాల్గొన్నారు.

### గొత్తికోయలకు వితరణ



వలస గొత్తికోయలకు సామగ్రి అందిస్తున్న రాంబాబు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని బచ్చువారిగూడెం పంచాయతీ రేగళ్ల గ్రామంలో నివాసం ఉంటున్న వలస గొత్తికోయ కుటుంబాలకు నారాయణపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ గ్రామ నాయకులు జక్కుల రాంబాబు ఆధ్వర్యంలో వితరణ అందించారు. ఆదివారం గ్రామంలోని 50 కుటుంబాలకు ఆయన సొంత ఖర్చులతో బియ్యం, దుప్పట్లు, నిత్యవరసరాలను పంపిణీ చేశారు.

### ఎమ్మెల్యే పరామర్శ

దమ్మపేట: అనారోగ్య కారణంగా హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న పలువురిని, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆదివారం పరామర్శించారు. దమ్మపేట, ములకలపల్లి మండలానికి చెందిన పలువురు అనారోగ్యంతో హైదరాబాద్‌లోని అపోలో, కేర్ ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జారే వారిని పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

# ‘నానో’నే నయం!

- ద్రవ రూపంలో నానో యూరియా, డీఏపీ
- గుళికల ఎరువుల కంటే పంటలకు ఎంతో మేలు
- తగ్గనున్న ఖర్చు, పెరగనున్న దిగుబడి

దుమ్ముగూడెం: కేంద్ర ప్రభుత్వం గుళికల రూపంలో ఉన్న యూరియా, డీఏపీలకు బదులుగా ద్రవ రూపంలో నానో ఎరువులు తయారు చేస్తున్నది. దీంతో రైతులకు తక్కువ ధరకు లభించడంతో పాటు రవాణా ఖర్చులు, తిప్పలు తప్పుతున్నాయి. అర లీటరు నానో యూరియా, డీఏపీ బాటిల్.. ఒక్క యూరియా, డీఏపీ బస్తాతో సమానంగా పంటపై ప్రభావం చూపుతుందని మండల వ్యవసాయాధికారి నవీన్‌కుమార్ చెబుతున్నారు. నానో ఎరువుల ఉపయోగం గురించి రైతులకు శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులతో పాటుగా అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. దీంతో ఏజెన్సీ ప్రాంతంలోని రైతులు నానో ఎరువులు వాడడానికి ఆసక్తి చూపేలా అవగాహన కల్పిస్తున్నారు.

**ధర తక్కువ.. లాభమెక్కువ**

అర లీటరు నానో యూరియా బాటిల్ గుళికల రూపంలో ఉన్న 45 కేజీల బస్తాతో సమానం. అదే విధంగా అరలీటరు నానో డీఏపీ బాటిల్ 50 కేజీల బస్తాతో సమానం. ధర విషయానికొస్తే యూరియా బస్తా రూ. 267 కాగా నానో బాటిల్ కేవలం రూ.225 మాత్రమే. డీఏపీ బస్తా రూ.1,350లు కాగా నానో డీఏపీ రూ.600 మాత్రమే. వ్యవసాయంలో వీటి వినియోగం వల్ల రైతులకు పెట్టుబడిలో ఖర్చులు కొంత తగ్గే అవకాశాలు ఉన్నాయి.

**బహుళ ప్రయోజనాలు..**

గుళికల రూపంలో ఉన్న యూరియా బస్తాను ఎకరం పొలంలో వాడడం వల్ల 60 శాతం మాత్రమే మొక్క గ్రహించగలుగుతుంది. మిగతా 40 శాతం గాలిలో కలిసి వాయుకాలుష్యం ఏర్పడుతుంది. డీఏపీ బస్తాను దుక్కిలో వేయాల్సి ఉంటుంది. కానీ, కొందరు రైతులు పైపాటుగా వేయడంతో మొక్కలకు ఎలాంటి ఫలితం దక్కడం లేదు. ద్రవ రూపంలో ఉన్న నానో యూరియా, నానో డీఏపీలను నేరుగా గానీ ఒక లీటరు నీటికి 4 ఎంఎల్ చొప్పున ఏదైనా పురుగుల మందులతో కలిపి పత్తి, వరి, మొక్క జొన్న, కూరగాయలు తదితర పంటలపై పిచికారీ చేసుకుంటే నేరుగా ఆకుల ద్వారా మొక్క వంద శాతం గ్రహిస్తుంది. ఆకుల్లో కిరణజన్య సంయోగ క్రియ ద్వారా వేర్లలో కణజాల వృద్ధికి ఉపయోగపడుతుంది. వర్షాభావ పరిస్థితులు, అధిక వర్షపాతంలోనూ నానో యూరియా, డీఏపీలను పంటలపై పిచికారీ చేసుకోవచ్చు. పంట వేసిన 20–25 రోజుల్లో ఒకసారి, 40–45 రోజుల్లో మరోసారి పిచికారీ చేసుకుంటే పంటల ఎదుగుదల బాగుంటుంది. రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులను దుక్కిలో వేసుకుని కలియదున్ని పంటలు సాగు చేసిన తర్వాత నానో ఎరువులను పంటలపై పిచికారీ చేస్తే అధిక దిగుబడులు వస్తాయని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.



డ్రోన్ ద్వారా నానో యూరియా పిచికారీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)